క్లుప్తంగా

ఇళ్ల పనులు పరిశీలన

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శనివారం అధికారులు పరిశీలించారు. బిల్లులు అందించాలని లబ్ధిదారులు కోరారు. తహసీల్దార్ కమల్‌సింగ్, ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీం ఖాన్, కార్యదర్శి ఉత్తమ్ తదితరులున్నారు.

లక్ష్మణచాంద ఎస్సైగా శ్రీనివాస్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై

లక్ష్మణచాంద: మండలానికి నూతన ఎస్సైగా శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన సుప్రియ బైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా బైంసా పట్టణ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జి. శ్రీనివాస్ బదిలీపై లక్ష్మణచాంద వచ్చారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్సై పేర్కొన్నారు.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

ముథోల్: మండల కేంద్రంలోని రవీంద్రా హైస్కూల్ విద్యార్థులు పాలిసెట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. యాసర్ అహ్మద్ బీపీసీలో 313వ ర్యాంకు, ఎంపీసీలో 718, నందిని బీపీసీలో 1,691, ఎంపీసీ 2,208, ధనశ్రీ బీపీసీ 2,032, ఎంపీసీ 2215, గౌరిప్రియ బీపీసీ 3,803, ఎంపీసీ 5,477, సుప్రియ బీపీసీలో 4,385, ఎంపీసీ 6,090వ ర్యాంకులు సాధించారు. ప్రిన్సిపాల్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్ విద్యార్థులను అభినందించారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల విద్యాలయంలో ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి విద్య, నైపుణ్య శిక్షణకు పూర్వ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. పదో తరగతి పూర్తి చేసి 18 నుంచి 25 ఏళ్లలోపున్న విద్యార్థులు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ నెల వరకు ఉంటుందని.. ఈనెల 30 వరకు అర్హులైన విద్యార్థులు పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

'డయల్ యువర్ డీఎం'కు స్పందన

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపోలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని డిపో మేనేజర్ పండరీ తెలిపారు. సోన్ మండలం గాంధీనగర్‌కు, కుంటాల మండలం అందకూర్ గుండా విఠాపూర్‌కు బస్సు నడిపించాలని ప్రయాణికులు కోరినట్లు పేర్కొన్నా రు. నిర్మల్ నుంచి బాసరకు ప్రత్యేక బ స్సు నడిపించాలని ఒంగోలు బస్సు నె ల్లూరు వరకు పొడిగించాలని ప్రయాణికులు కోరినట్లు డీఎం తెలిపారు. ఉన్నతాధికా రుల అనుమతి తీసుకొని.. ఏర్పాట్లు చేస్తామని డిపో మేనేజర్ హామీ ఇచ్చారు.

వాహనదారులకు జరిమానా

లోకేశ్వరం: వాహనాలను వేగంగా నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండలంలోని మన్మద్ ఎక్స్ రోడ్డుపై వాహనాల తనిఖీ నిర్వహించారు. 15 వాహనాలు తనిఖీ చేసి ధ్రువపత్రాల్లేని వాహనదారులకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై దిగంబర్, పోలీసులు ఉన్నారు.

గంగా భవానీశ్వరుల కల్యాణోత్సవం

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధి చింతలపేట్‌లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగాదేవి ఆలయ ఆరో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బొమ్మెన రాజశేఖర్ శాస్త్రి, సతీశ్‌చారి ఆధ్వర్యంలో గంగాదేవికి అభిషేకాలు, అర్చనలు గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, అఖండ స్థాపన, తదితర పూజాది కార్యక్రమాలు, గంగా భవానీశ్వరుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే


చెక్కులు అందిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణం, నిర్మల్‌రూరల్, మామడ, లక్ష్మణచాంద, సోన్, సారంగాపూర్, దిలావర్‌పూర్ నర్సాపూర్(జి) మండలాలకు చెందిన 158 మంది లబ్ధిదారులకు రూ.45,41,000 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, రావుల రాంనాథ్, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మల్‌లో సైలెన్సర్ల మోత..



డుగ్.. డుగ్.. డుగ్ మని రోత పుట్టించేలా సౌండ్ చేసుకుంటూ వెళ్లే బైక్‌ల సంఖ్య పట్టణంలో రోజురోజుకు ఎక్కువవుతుంది. ఈ శబ్దాలతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు. షోరూంలో కొన్నప్పుడు బైక్‌లతో వచ్చే సైలెన్సర్ల(పొగగొట్టాలు)ను తీసేసి..అధిక శబ్దాలు వచ్చే పరికరాలను తమ వాహనాలకు అమర్చుకోవడం కొంతమంది యువత స్టేటస్ సింబల్‌గా భావిస్తున్నారు. సాధారణ బైక్‌లతోపాటు బుల్లెట్ బండ్లకు జంతువుల అరుపులు, బాంబులు పేలినట్లు శబ్దాలు చేసే సైలెన్సర్లు ఏర్పాటు చేసుకుంటూ పాదచారుల గుండెల్లో దడ పుట్టిస్తున్నారు. మోటారు వాహనాల చట్టం యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ.. అధిక శబ్దాన్నిచ్చే సైలెన్సర్లు బిగించుకొని ఊరంతా తిరుగుతున్న యువకులపై పోలీసులు మాత్రం చర్యలు చేపట్టడం లేదు. - నిర్మల్‌టౌన్

- శ్రుతి మించుతున్న యువత చేష్టలు
- అధిక సౌండ్ వచ్చే వాటిని బైకులకు అమర్చుతున్న వైనం
- భయపడుతున్న పట్టణవాసులు
- చోద్యం చూస్తున్న పోలీసులు

ఫ్యాషన్ అని భ్రమపడుతున్న యువత..

బుల్లెట్ బైక్‌లలో ఏడెనిమిది రకాలున్నాయి. క్లాసిక్ 350, హంటర్ 350, బుల్లెట్ 350, 650 మోడళ్లు ఉన్నాయి. వీటితోపాటు ఇతర కంపెనీల వాహనాలకు సైతం షోరూం నుంచి వచ్చి బైక్‌లతో వచ్చిన సైలెన్సర్లను తీయించేస్తున్నారు. రూ.మూడు వేల నుంచి రూ.15 వేల విలువ కలిగిన భారీశబ్దాల సైలెన్సర్లను పట్టణంలో ఉన్న సర్వీసింగ్ సెంటర్లలో అమర్చుకుంటున్నారు. ఎక్కువగా ఇంటర్, డిగ్రీ చేసే విద్యార్థులు ఈ శబ్దాల వాహనాలను ఒక ఫ్యాషన్‌గా భావిస్తున్నారు.

చిన్నారులు, వృద్ధులపై ఎఫెక్ట్..

అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను వినియోగంతో శబ్ద కాలుష్యంతోపాటు, వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. బీపీ, గుండె జబ్బులున్న వారు ఈ శబ్దాలకు ఉలిక్కిపడి ఆసుపత్రుల్లో చేరుతున్నారు. అంతేకాక రోడ్డుపై వెళ్లే మిగతా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విక్రయదారులపై చర్యలేవి..

కంపెనీలు రవాణాశాఖ నిబంధనలకు లోబడే వాహనాలు తయారు చేస్తాయి. మార్కెట్లో విచ్చలవిడిగా మెకానిక్ షాపుల్లో అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లను విక్రయిస్తున్నారు. మొదటగా సైలెన్సర్లు విక్రయించే షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు.. పోలీసులను వేడుకుంటున్నారు. వారిపై చర్యలు తీసుకుంటే అమ్మడం ఆపేస్తారని సూచిస్తున్నారు.

రెండేళ్లుగా తనిఖీల్లేవ్..

2023 సెప్టెంబర్ లో పట్టణంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి 126 సైలెన్సర్లను ధ్వంసం చేసి..ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. అప్పటినుంచి మళ్లీ స్పెషల్‌డ్రైవ్‌లు నిర్వహించలేదు.

సౌండ్‌తో అసౌకర్యం..



అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లను బైక్‌లకు అమర్చుకుంటూ కొందరు ప్రజల్ని ఇబ్బంది పెడుతున్నారు. మైనర్లు సైతం వాహనాలు నడుపుతున్నారు. అధిక శబ్దాలకు గుండె, బీపీ సమస్యలున్నవారు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలి. - శంకర్, నిర్మల్

స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తాం



రవాణాశాఖ నిబంధనలకు విరుద్ధంగా అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లు అమర్చిన బైక్‌లను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తాం. సైలెన్సర్లను అమర్చుకునే ద్విచక్ర వాహనదారులకు మొదటిసారి జరిమానాలు విధిస్తాం. రెండోసారి కేసులు నమోదు చేస్తాం. సైలెన్సర్లను అమర్చే మెకానిక్ షాప్‌లకు నోటీసులు పంపి చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తాం. - పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్

అధిక శబ్దాలతో వినికిడి లోపం



అధిక సౌండ్స్ తరచుగా వింటే వినికిడి లోపం వచ్చే ప్రమాదం ఉంది. చిన్నారులు, వృద్ధులు, గుండె సమస్యలున్న వారితోపాటు గర్భిణులకు ముప్పు ఎక్కువ. దీంతో నిద్రభంగం కూడా కలుగుతుంది. ఈ వాహనాలను నడపకపోవడమే మంచిది. - డాక్టర్ స్వప్న, పీడియాట్రిక్

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి

లక్ష్మణచాంద: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో విద్యార్థులకు బోధించాలని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ వనజ పేర్కొన్నారు. మండలంలోని వడ్యాల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో శనివారం ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ.. ప్రవేశాలు పెరిగేలా చూడాలని పేర్కొన్నారు. సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మంచి విషయాలు నేర్పించాలని సూచించారు. ఎంఈవో అశోక్‌వర్మ, మండల రిసోర్స్ పర్సన్లు మోహన్, గంగాధర్, చంద్రమోహన్, తేజ, సాయన్న, శివరాణి, అర్చన, మారుతి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు మహేందర్, సుధాకర్ పాల్గొన్నారు.


వడ్యాల్‌లో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ వనజ

తానూరు: శిక్షణలో నేర్పిన బోధన పద్ధతులతో ఉపాధ్యాయులు.. విద్యార్థులకు నేర్పించాలని ఎంఈవో నరేందర్ సూచించారు. ఈనెల 20 నుంచి కొనసాగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మితమవుతుందని పట్టణానికి చెందిన పిల్లల వైద్య నిపుణుడు, డాక్టర్ అనిల్ జాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. చదువుతోపాటు విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పద్మావతి, సుమలత, ఎంఈవో సుభాష్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ముగిశాయి. శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్లను ఉపాధ్యాయులు సన్మానించారు. కోర్సు డైరెక్టర్, ఎంఈవో వై.సాయన్న తదితరులున్నారు.

రైతులను ముంచుతున్న వర్షం


కామోల్‌లో తడిసిన ధాన్యం చూపుతున్న రైతులు


కుంసరలో మొలకెత్తిన ధాన్యం చూపుతున్న రైతు

భైంసారూరల్: మూడు రోజులుగా అకాల వర్షం అన్నదాతను ఆందోళనకు గురి చేస్తోంది. మండలంలోని కుంసర, కామోల్ గ్రామాల్లో కల్లాల ఎదుట విక్రయించేందుకు ఉంచిన ధాన్యం తడిసింది. దీంతో మొలకలు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంక్షల్లేకుండా తడిసిన ధాన్యం కొని తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో రైతులకు నష్టం వాటిల్లింది. కుంటాల కొనుగోలు కేంద్రం వద్ద జొన్నలు తడిసి పోయి మొలకలు వచ్చాయి. శనివారం వాటిని ఆరబెట్టేందుకు రైతులు నానావస్థలు పడ్డారు.


కుంటాలలో జొన్నలను ఆరబెడుతున్న రైతులు

అధికారుల విచారణ

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం కొన్న భూమిని మాకే అప్పగించాలని కోరుతూ పలువురు లబ్ధిదారులు ఇటీవల కలెక్టర్ అభిలాష అభినవ్‌కు విన్నవించారు. గతంలో 20 మంది గ్రామస్తులు 29 గుంటలు కొనుగోలు చేయగా బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం సదరు భూమిని తీసుకోవడంతో గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం తహసీల్దార్ కమల్‌సింగ్, అధికారులు గ్రామంలో విచారణ జరిపారు. ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, కార్యదర్శి సారిక ఉన్నారు.

ఎంపీడీవో పర్యటన

లోకేశ్వరం: మండలంలోని జోహర్‌పూర్, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో వైకుంఠధామం, నర్సరీలను శనివారం ఎంపీడీవో వెంకటరమేశ్ పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ రోడ్లపై, చెత్తాచెదారం తొలగించాలని పేర్కొన్నారు.

తడిసిన ధాన్యం కొనాలి

లోకేశ్వరం: అకాలవర్షాలకు తడిసిన వరి ధాన్యం కొనాలని ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రశాంత్, దిగంబర్ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మామడ: వరిధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు.. సెర్ప్ సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని పొన్కల్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించారు. సెర్ప్ సీసీ సవితను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ నర్సారెడ్డి, రైతులు ఉన్నారు.

దస్తురాబాద్ మండలంలో..

దస్తురాబాద్: మండలంలోని మున్యాల, రేవోజీపేట, బుట్టాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ విశ్వంబర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హమాలీలను రప్పించి తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. ఏపీఎం గంగన్న, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.


మామడ : పొన్కల్‌లో బస్తాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, తదితరులు

'భూభారతి'తో రైతులకు మేలు

కుంటాల: భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారమై రైతులకు మేలు జరుగుతుందని తహసీల్దార్ కమల్‌సింగ్ పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుల ప్రక్రియ పరిశీలించారు. మండల వ్యాప్తంగా నిర్వహించిన సదస్సుల్లో 667 దరఖాస్తులు రాగా 653 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 553 మంది రైతులకు నోటీసులు జారీ చేస్తామని తహసీల్దార్ కమల్‌సింగ్ వెల్లడించారు. కార్యక్రమంలో డీటీ నరేశ్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ


ర్యాలీ తీస్తున్న బీజేపీ నాయకులు

ఖానాపూర్: ఆపరేషన్ సిందూర్‌తో భారత సైన్యం పరాక్రమాన్ని, ధైర్య సాహసాలను కీర్తిస్తూ శనివారం ఖానాపూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా హిందూ సంఘాలతో కలిసి పట్టణంలో జాతీయ జెండాలతో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో నాయకులు మంత్రరాజం సురేశ్, కీర్తి మనోజ్, పుప్పాల ఉపేందర్, ఐదు వెంకటేష్, బుక వెంకటేశ్వర్లు, తరణ్, సత్యవతి, రవీందర్‌రెడ్డి, లింబాద్రి, రవీందర్, గిరి, అనిల్‌రావు, రమేశ్, భూమన్న, స్వామి, సురేందర్, భూమాగౌడ్, రాంసింగ్, వరుణ్, శేఖర్, పవన్, జీవన్ తదితరులు ఉన్నారు.

ఆంక్షల్లేకుండా తడిసిన ధాన్యం కొనాలి

- ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్


కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసారూరల్: అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వరి ధాన్యాన్ని ఆంక్షల్లేకుండా ప్రభుత్వమే కొనాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని వానల్‌పాడ్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ శాతం పేరిట రైతులను వేధించవద్దని పేర్కొన్నారు. కొనుగోళ్లలో జాప్యం లేకుండా వెంటనే కేంద్రాల్లోని ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులను ఇబ్బందులు పెడితే వారి పక్షాన పోరాటం చేస్తానని హెచ్చరించారు. బీజేపీ నాయకులు శంకర్, రావుల రాము, చందర్ పటేల్, సాయారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రకృతి పంటలతో ఆరోగ్యం

పెంబి: ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన పంటలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని డీఏవో అంజిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పెంబి రైతువేదికలో జిల్లా ఉద్యానవన అధికారి రమణకుమార్‌తో కలిసి నేషనల్ మిషన్ ఆన్ న్యాచురల్ ఫార్మింగ్ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో నవీన్, హెచ్ఓ స్పందన, ఏఈఓలు రాజ్‌కుమార్, నాగమణి రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఏవో అంజిప్రసాద్

వేధిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయండి

నిర్మల్‌టౌన్: మహిళలు వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని షీ టీం ఎస్సై పెర్సిస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో 200 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు పోక్సో చట్టాలు, చైల్డ్ మ్యారేజ్, గాంజా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు ఉపాధ్యాయులు సహకారం అందించాలని కోరారు. విద్యార్థి నడవడిక అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళా రక్షణ, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీం పోలీసులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న షీ టీం ఎస్సై పెర్సిస్

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

- డీపీవో శ్రీనివాస్

కుభీర్: వర్షాకాలం సమీపిస్తున్న వేళ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజలు రోగాల బారిన పడకుండా కాపాడాలని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీపీవో మాట్లాడారు. చెత్తాచెదారం లేకుండా మురుగుకాల్వలను, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తే జరిమానాలు విధించాలని సూచించారు. ఇంటి పన్నులు వసూలు చేస్తూ.. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. డీఎల్‌పీవో బి.సుదర్శన్ పటేల్, ఎంపీడీవో సాగర్‌రెడ్డి, ఎంపీవో మోహన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.


మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

రైతులను మోసం చేస్తే లైసెన్సు రద్దు

సోన్: రైతులను మోసం చేసిన నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే దుకాణ లైసెన్సు రద్దు చేస్తామని ఎస్సై గోపి, ఏవో వినోద్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. స్టాక్ రికార్డులు, నిల్వలు పరిశీలించారు. రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని.. ధరల పట్టిక బోర్డును దుకాణంలో రైతులకు కనబడేలా ఏర్పాటు చేయాలని సూచించారు. లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలను కొనాలని రైతులకు సూచించారు. ఇందులో పోలీస్, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

లోకేశ్వరం: నకిలీ విత్తనాలు విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ వినయ్‌బాబు అన్నారు. శనివారం ముథోల్ రైతువేదికలో మండలంలోని ఫర్టిలైజర్ డీలర్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక ధరలకు విక్రయించకుండా అన్ని వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో గిరిరాజ్, ఏఈవోలు మౌనిక, భూమేశ్, మౌనిక ఉన్నారు.


సోన్‌లో తనిఖీ చేస్తున్న ఎస్సై గోపి, ఏవో వినోద్ కుమార్

ప్రతిభా పురస్కారం అందుకున్న 'పది' టాపర్లు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్, సుర్జాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఇటీవల పదో తరగతి చదివి టాపర్లుగా నిలిచిన విద్యార్థులు శుక్రవారం ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్, కలెక్టర్ అభిలాష అభినవ్ చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. మస్కాపూర్ నుంచి శ్రీవల్లి, రాజు, ఆదర్శిని, స్నిగ్ధ, రోహిత్‌రాజ్.. సుర్జాపూర్ జెడ్పీహెచ్ఎస్ నుంచి ఎండీ సన ప్రశంసపత్రం అందుకున్నారని హెచ్ఎంలు నరేందర్‌రావు, ఊర్మిళ తెలిపారు. పట్టణంలోని జ్యోతిబాపూలే బాలికల పాఠశాలకు చెందిన శ్రీవాణి, వృచిత, మానస, శ్రీలత, తేజస్విని పురస్కారం అందుకున్నట్లు ప్రిన్సిపాల్ సృజనాదేవి తెలిపారు. ఈసందర్భంగా వారిని పలువురు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

పీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

ఖానాపూర్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజిద్, చిన్నం సత్యం, శంకర్, గంగాధర్, అశోక్, తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: మండలకేంద్రంలో మహేశ్‌కుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రాలు మూసివేయాలనడం సరికాదు'

ఖానాపూర్: ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు జరిగే డిగ్రీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని జిరాక్స్ సెంటర్ల తరహాలో మీ సేవా కేంద్రాలు మూసివేయాలని పేర్కొనడం సరికాదని మీ సేవా ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కామోజీ వేణుగోపాల్, మీసేవా నిర్వాహకుడు కిరణ్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు జరిగే పరీక్షల సందర్భంగా ఉదయం 8 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జిరాక్స్ సెంటర్లతో పాటు మీ సేవా సెంటర్లను మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా సామాన్య ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. మీ సేవా కేంద్రాలను మినహాయించాలని ఉన్నతాధికారులను కోరారు.